ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
మంగళవారం 15 ఏప్రిల్ 2025


పాచిపెంట మండలం పణుకువలసలో పండగ చేసుకుంటున్న దృశ్యం


చెరుకుపల్లి వద్ద గేటు ఏర్పాటు చేసి వాహనదారుల నుంచి సుంకం వసూలు చేస్తున్న గిరిజనులు


కూనంబందవలసలో ఇంటింటా సామగ్రి దండుతున్న మహిళలు

గిరిసీమల్లో సందడి

- ఇటుక పండగ ప్రారంభం ● సంబరాల్లో గిరిజనులు
- పితృ, గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు
- సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా వేడుకలు

సాలూరు రూరల్,
ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని గిరిసీమల్లో సందడి మొదలైంది. ఇటుక పండగ ప్రారంభమైంది. ఉగాది (చైత్రోత్సవాలు) ఉత్సవాలను గిరిజనులు ఘనంగా జరుపుకుం టున్నారు. పెద్దపండగగా భావించే వారు నియమ నిష్ఠలతో పితృదేవతలను పూజిస్తున్నారు. తమ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేడుకలు జరుపుతున్నారు. తమ వారసులకు వేట నేర్పిస్తూ.. కుటుంబ ఐక్యతను చాటిచెబుతున్నారు. మొత్తంగా గిరిజనులు ఉత్సాహంగా సంబరాలు చేసుకుంటున్నారు.

గ్రామ పెద్ద నిర్ణయం మేరకు..

ఏటా చైత్రమాసంలో జరుపుకునే ఇటుక పండగను మన్యంలో అన్ని గిరిజన గ్రామాల్లో ఒకే రోజు నిర్వహించరు. చైత్ర శుద్ధ పాడ్యమి తర్వాత గ్రామపెద్ద నిర్ణయం మేరకు ఈ పండగను జరుపుతారు. ఈ పండగ ప్రారంభానికి ముందుగా గ్రామానికి పాత చీపుర్లు, చెప్పులు, చేటలతో కట్టుకడతారు. దీని వల్ల గ్రామంలోకి దుష్టశక్తులు ప్రవేశించవని వారి నమ్మకం. సాధారణంగా గురువారం నుంచి పండగ ప్రారంభించి మంగళవారం ముగిస్తారు. అయితే వేట లభ్యం కాని పక్షంలో ఈ పండగ పొడిగింపు ఉంటుంది

పండగ ఇలా..

పండగ తొలిరోజున కుటుంబాల వారీగా (ఇంటి పేరు ఒకటిగా ఉన్న వంశస్థులు) బియ్యం సేకరిస్తారు. గత ఇటుక పండగ తర్వాత వివాహాలు చేసుకున్న జంటలకు


తొలి వేటకు పూజ చేస్తున్న దృశ్యం

భోజనాలు ఏర్పాటు చేస్తారు. వారితో కలసి ఒకే ఇంటి పేరున్న కుటుంబీకులంతా భోజనాలు చేస్తారు. రెండో రోజు కొత్త మామిడితో పచ్చడి చేసి ప్రసాదంగా స్వీకరిస్తారు. పితృదేవతలకు కొత్త బట్టలు, అన్నం, కూర తదితర ఆహార పదార్థాలను మూలన పెట్టి పూజిస్తారు. కోడిని సైతం మొక్కుబడిగా చెల్లిస్తారు. మూడో రోజు నేల తల్లికి పూజలు చేస్తారు. ఈ సందర్భంగా థింసా, తమ సంస్కృతికి సంబంధించిన నృత్యాలు చేసి అంతా సంతోషంగా గడుపుతారు. నాలుగో రోజు ఇటుక పండగ చేస్తారు. ఈ సందర్భంగా తొలుత గోనస వేట చేస్తారు. దానిని థింసా వాయిద్యాలతో గ్రామాల్లో ఊరేగిస్తారు. దానికి గిరిజన పూజారి పూజలు చేస్తారు. తమ గ్రామదేవత (ఒక్కో గ్రామానికి ఒక్కో దేవత ఉంటుంది.)లకు పూజలు చేస్తారు. అనంతరం వేటకు వేళ్లే వారికి భత్యం (బియ్యం, డబ్బులు, ఇతర సామగ్రి) సేకరిస్తారు. ఐదో రోజున వేట సులభంగా సాగి వీలైనంత పెద్ద జంతువు దొరకాలని ఆశిస్తూ అడవి తల్లికి పూజలు చేస్తారు. అడవి తల్లికి నైవేద్యంగా కోడిని వదిలి పెడతారు. ఈ పూజలన్నీ సంప్రదాయ బద్ధంగా గిరిజన పూజారి ఆధ్వర్యంలో జరుగుతాయి. ఆరో రోజు గ్రామంలో పురుషులు వేటకు బయలుదేరుతారు. వారు ఏదైనా జంతువుతో (కనీసం కుందేలు) తిరిగి వచ్చే వరకు మహిళలు దుస్తులు ఉతకరు. వాకిలు ఊడ్చరు. పనులకు కూడా వెళ్లరు. ఉదయం తొమ్మిది గంటల తర్వాత బోరు కూడా కొట్టరు. వేటకు వెళ్లని వారు సైతం ఎటువంటి పనులకు వెళ్లరు. ఉద్యోగులు మాత్రం గ్రామకట్టుబాటు ప్రకారం జరిమానా చెల్లించి విధులకు వెళ్తారు. వేటకు వెళ్లిన వారు వచ్చే వరకు కొందరు సమీప పట్టణాలకు వెళ్లిన థింసా నృత్యాలు చేస్తూ సుంకం వసూలు చేస్తారు. అదేవిధంగా రహదారుల్లో గేట్‌లా కర్ర అడ్డం పెట్టి వాహనాలను నిలిపి ఎంతో కొంత వసూలు చేస్తారు. అయితే కచ్చితంగా సుంకం ఇవ్వాలనే ఒత్తిడి లేదు. సాలూరు మండలం

(మిగతా 6వ పేజీలో..)

ప్రారంభానికి ముందే..

- పెచ్చులూడిపోతున్న బీటీ రోడ్డు
- ఏజెన్సీలో పనుల తీరుపై విమర్శల వెల్లువ

పార్వతీపురం/కురుపాం రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందుకోసం భారీగా నిధులు కేటాయిస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులపై పర్యవేక్షణ లోపిస్తోంది. దీంతో రోడ్డు నిర్మాణాలు సక్రమంగా జరగడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కోట్లాది రూపాయల అంచనాలతో ఏజెన్సీ గ్రామాలను కలుపుతూ నిర్మిస్తున్న తారురోడ్లు ప్రారంభానికి ముందే పెచ్చులూడిపోతుండడం చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. కురుపాం మండలం జి.శివడ పంచాయతీ పరిధి అంటిజోల-మనిగ మధ్య 2.3 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డును సుమారు రూ.1.57 కోట్ల అంచనాతో నిర్మిస్తున్నారు. భామిని, కురుపాం మండలాలకు ఇది సరిహద్దు రహదారి. దీని పనులు దాదాపు పూర్తికావచ్చాయి. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఈ రోడ్డులోని కొంత భాగంలో తారు పెచ్చులూడుతుండడంపై


అంటిజోల-మనిగ రోడ్డు ఇలా..

గిరిజనులు పెదవి విరుస్తున్నారు. రోడ్డు పనులు ఇలానే చేపడతారా? అంటూ మండి పడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపమే ఇందుకు కారణమని వారు చెబుతున్నారు. ప్రారంభానికి ముందే రోడ్డు ఇలా మారడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనుల్లో నాణ్యత లోపంపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్థులు, జి.శివడ సర్పంచ్ మిన్నారావు తదితరులు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీరాజ్ శాఖ ఏఈఈ పి.నాగేశ్వరరావును వివరణ కోరగా.. 'రోలర్ రిపేర్ కారణంగా సక్రమంగా రోలింగ్ అవ్వలేదు. దీంతో రోడ్డుపై యూటర్న్ వద్ద తారు పెచ్చు లూడుతోంది. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు పూర్తిచేస్తాం. నాణ్యత లోపం తలెత్తకుండా చూస్తాం. అన్ని పనులు పూర్తి చేసిన తర్వాతే రోడ్డును ప్రారంభిస్తాం.' అని తెలిపారు.


రోడ్డుపై తారు పెచ్చులూడిన దృశ్యం

మృత్యుంజయుడు

- ఏనుగుల దాడి.. ప్రాణాలతో బయటపడిన వ్యక్తి
- భామిని మండలంలో ఘటన

భామిని, ఏప్రిల్14(ఆంధ్రజ్యోతి): భామిని మండలం సింగిడి గ్రామంలో సోమవారం ఓ వ్యక్తిపై ఏనుగులు దాడి చేశాయి. అయితే ఊహించని విధంగా ప్రాణాలతో బయటపడి మృత్యుంజయుడుగా నిలిచాడు. వివరాల్లోకి వెళ్తే.. భామిని మండలంలో బిల్లుమడలో కొద్దిరోజులుగా సంచరిస్తున్న నాలుగు గజరాజులు సోమవారం సింగిడి గ్రామానికి చేరుకున్నాయి. వాటిని చూసేందుకు గ్రామస్థులు ఎగబడ్డారు. అదే గ్రామానికి చెందిన శంకర్ పూజారి తన షాపులో అరటి గెల తీసుకొని బయల్దేరాడు. ఏనుగులున్న ప్రాంతానికి చేరుకుని అరటి గెలను ఇవ్వబోయాడు. ఇంతలో గజరాజులు ఆ వ్యక్తిని పొలాల్లోకి ఈడ్చుకెళ్లాయి. దీంతో శంకర్ అపస్మాకర స్థితికి చేరాడు. ఆయన చుట్టూనే ఏనుగులు తిరగడంతో స్థానికులు షాక్‌కు గురయ్యారు. ఏం చేయాలో అర్థం కాలేదు. ఆ ప్రాంతంలోని బురదలో చిక్కుకుపోయిన శంకర్ చనిపోయాడని అంతా భావించారు. మరోవైపు చీకటి పడిపోవడంతో ఎవరూ గజరాజుల వద్దకు వెళ్లేందుకు సాహసించలేకపోయారు. ఈ విషయం తెలుసుకున్న అటవీశాఖకు చెందిన ఏడుగురు ట్రాకర్స్ ఆ ప్రాంతానికి చేరు కున్నారు. తీవ్రంగా శ్రమించి ఏనుగులను ఆ ప్రాంతం నుంచి తరలించారు. వెంటనే శంకర్ వద్దకు


బాధితుడు శంకర్

చేరుకుని లేపగా.. ఆయన స్పృహలోకి వచ్చాడు. దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. హుటాహుటిన ఆయన్ని భామిని పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడి నుంచి సీతంపేట సీహెచ్‌సీకి తరలించారు. శంకర్‌కు గాయాలేవీ కానట్లు వైద్యులు తెలిపారు. బత్తిలి ఎస్ఐ అనిల్‌కుమార్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ప్రజలను పంపించేశారు. ఏనుగులను చూడడానికి ఎవరూ రావొద్దని, వాటి సమీపానికి వెళ్లడం మంచిది కాదని ట్రాకర్స్ చెప్పారు. కవ్వింపు చర్యలకు పాల్పడరాదని సూచించారు.


సింగిడి పొలాల్లో సంచరిస్తున్న గజరాజులు

మరో 110 మంది..

- సీతంపేట ఐటీడీఏలో సికిల్ సెల్ అనీమియా బాధితులు ● పింఛన్ మంజూరుకు అర్హత


వైద్యశిబిరానికి హాజరైన సికిల్‌సెల్ బాధితులు, వారి కుటుంబసభ్యులు (ఫైల్)

సీతంపేట రూరల్,ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలో కొత్తగా 110 మంది సికిల్‌సెల్ అనీమియా బాధితులు ఎన్టీఆర్ భరోసా పింఛన్‌కు అర్హత సాధించారు. వారికి ఈ ఏడాది జూన్ నుంచి రూ.10వేల చొప్పున ప్రతినెలా పింఛన్ అందే అవకాశం ఉంది. ఇప్పటివరకు ఐటీడీఏ పరిధిలో 35 మంది గిరిజనులు ఈ పింఛన్ పొందుతున్నారు. త్వరలో వారితో పాటు కొత్తగా నిర్ధారించిన 110 మంది సికిల్ సెల్ అనీమియా బాధితులకు కూడా పింఛన్ మంజూరు కానుంది.

ఇదీ పరిస్థితి..

● సికిల్‌సెల్ అనీమియా బాధితులు పైకి చూసేందుకు వారు బాగానే కనిపించినా.. ఉన్నట్టుండి కళ్లు తిరిగిపడి పోవడం, నీరసించి పోవడం వంటి లక్షణాలు వెంటాడుతుంటాయి. వారికి ప్రతినెలా రక్తం ఎక్కించాల్సి వస్తోంది. వారికి వైద్యం ఎంతో ఖర్చుతో కూడుకున్నది కావడంతో ఇప్పటికే ఆ వ్యాధిగ్రస్థులకు ప్రభుత్వం పింఛన్ రూపంలో రూ.10వేలు అందిస్తోంది. కొత్తగా ఈ పెన్షన్ పొందాలంటే సికిల్‌సెల్ అనీమియా రోగులు విశాఖ కేజీహెచ్ ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తోంది. ఎన్ని రోజులైనా అక్కడే ఉండి హెచ్‌బీ ఎల్‌సీ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని అక్కడ వైద్యుల నుంచి ధ్రువ పత్రం పొందాల్సి వచ్చేది. ఈ సర్టిఫికెట్ కోసం బాధితులతో పాటు వారి కుటుంబసభ్యులు అనేక పాట్లు పడేవారు. వారి కష్టాలను గమనించిన ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి విశాఖ కేజీహెచ్ వైద్య సిబ్బందిని సీతంపేట వైటీసీకి రప్పించారు. గత ఏడాది డిసెంబరులో ఐటీడీఏ పరిధిలో పలువురికి హెచ్‌బీఎల్‌సీ పరీక్షలు చేయించారు.

● ఈ ప్రత్యేక వైద్య శిబిరంలో అప్పుడే పుట్టిన శిశువు నుంచి 40ఏళ్ల వయసు కలిగిన సుమారు లక్ష మందికి సాలుబిలిటీ పరీక్షలు నిర్వహించారు. వీరిలో 225 మందికి పాజిటివ్ అని వచ్చింది. వారికి కేజీహెచ్ వైద్యులు హెచ్‌పీఎల్‌సీ(హై పెరఫార్మెన్స్ లిక్విడ్ క్రొమటో గ్రఫి)పరీక్షలు చేసి.. 110మందికి ఈ వ్యాధి ఉన్నట్లు తేల్చారు. అనంతరం వారికి వ్యాధి నిర్ధారణ ధ్రువ పత్రాలు అందజేశారు. వాటి ఆధారంగా పీహెచ్‌సీల వైద్యాధికారులు బాధితులకు ప్రభుత్వం అందించే పింఛన్‌కు అవసరమయ్యే దరఖాస్తును నింపి డీఎంహెచ్‌వో కార్యాలయానికి పంపించారు. అక్కడ దరఖాస్తుల పరిశీలన పూర్తయింది. త్వరలో 110 మంది అనీమియా బాధితులకు పింఛన్ వచ్చే అవకాశం ఉంది.

చేపల వేటకు విరామం (8లో)

- నేటి నుంచి అమలు ● ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

జారి పడిన ఎక్స్‌కవేటర్.. నిలిచిన విద్యుత్ సరఫరా (6లో)

- రెండు రోజులుగా గిరిజనులకు తప్పని ఇబ్బందులు

రాళ్లు తేలిన దారిలో అవస్థలు

- పార్వతీపురం-పాలకొండ రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతున్న వాహనదారులు

ఇప్పలపోలమ్మ పండగ ఖరారు

- జూన్ 3న పార్వతీపురంలో సిరిమానోత్సవం
- ఈ నెల 21న చాటింపు


(6లో)

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్
- కలెక్టరేట్‌లో ఘనంగా జయంతి వేడుకలు


అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్

పార్వతీపురం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా కలెక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన జీవిత చరిత్రపై సమాచార పౌర సంబంధాల శాఖ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ' అంబేడ్కర్ దూరదృష్టి కారణంగానే దేశం ఏకతాటిపై నడుస్తోంది. ఆ మహనీయుడి స్ఫూర్తితో జిల్లాలో ఎస్టీ, ఎస్సీలు ఆర్థికాభివృద్ధి దిశగా అడుగులు వేయాలి. ఇంటర్ ఫలితాల్లో సాంఘిక సంక్షేమ వసతిగృహాల విద్యార్థులు 71 శాతం ఉత్తీర్ణత సాధించారు. రూ.2కోట్లతో వసతిగృహాల్లో మర మ్మతులు, అదనపు వసతులు ఏర్పాటు చేస్తున్నాం. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.11.53 కోట్లతో లబ్ధిదారులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. విద్యార్థులకు ఉపకార వేతనాలు, స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నాం.' అని తెలిపారు.

పార్వతీపురం సాంఘిక సంక్షేమ వసతిగృహం-1కు చెందిన డిగ్రీ రెండో సంవత్సరం విద్యార్థి పి.రిమా, బందలుప్పి జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బి.సుస్మిత అంబేడ్కర్ గొప్పతనంపై స్ఫూర్తిదాయకంగా ప్రసంగించారు. సీతానగరం మండలం పెద బొండపల్లికి చెందిన మూకళ్ల నిఖిల్‌కు విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారులు రూ.39 వేలు విలువ చేసే ల్యాప్‌టాప్‌ను అందించారు. పాలకొండ మండలం తుమరాడకు చెందిన బొంతు శిరీషకు రూ.13 వేలు విలువ చేసే టచ్‌ఫోన్‌ను అందించారు. 15 మంది ఎస్సీ, ఎస్టీ రైతులకు రాయితీపై రూ.4.52 లక్షల విలువైన 15 వ్యవసాయ పవర్ వీడర్స్‌ను అందజేశారు. ఐదుగురు మహిళా లబ్ధిదారులకు 30 రకాల విత్తనాల కిట్‌బ్యాగ్‌లను పంపిణీ చేశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 12,785 మందికి బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ కింద రూ.74.26 లక్షలను మంజూరు చేశారు. చవితి మీనాక్షికి రూ.50 వేల విలువైన గొర్రెల యూనిట్, ఏనుగుల వనితకు పీఎంజేవై పథకం కింద రూ.2 లక్షల విలువైన ఫొటో స్టూడియో యూనిట్ మంజూరుకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. వసతిగృహాలకు పరుపులను అందించారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలతో విద్యార్థులు అలరించారు.

266 యూనిట్ల స్థాపనకు రూ.11.53 కోట్లు

'షెడ్యూల్డ్ కులాల కార్యాచరణ ప్రణాళిక కింద ఎస్సీ యువత నుంచి స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు స్వీకరణ ప్రారంభమైంది. జిల్లాలో 266 యూనిట్లను రూ.11.53 కోట్లతో ఏర్పాటు చేస్తాం. ఇందులో సబ్సిడీ రూ.4.34 కోట్లు కాగా బ్యాంకు లోను రూ.6.14 కోట్లు. లబ్ధిదారుని వాటా రూ.55.14 లక్షలుగా ఉంటుంది. ఏపీవోబీఎంఎంఎస్. ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా మే 10 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చు. అని కలెక్టర్ తెలిపారు.



నృత్యాలతో అలరించిన విద్యార్థినులు

గిరిసీమల్లో సందడి

(ఐదో పేజీ తరువాయి)

జీగిరాం నుంచి పి.కోనవలస వరకు గిరిజనులు పలు చోట్ల సుంకం వసూలుకు టోల్‌గేట్లు పెట్టగా.. కొందరు వాహనదారులు యూపీఐ ద్వారా చెల్లించారు. వారు సంతోషంగా ఇచ్చిన పైకంతో గ్రామస్తులంతా సరదా చేసుకుంటారు. వేటకు వెళ్లిన వారు జంతువులతో తిరిగి వస్తే దానిని అంతా సమానంగా పంచుకుంటారు. సన్నిహితులకు, బంధువులకు నజరానాగా పంపిస్తారు. ఇటుక పండగ వల్ల గిరిజనుల్లో ఐక్యత, అనురాగాలు, కుటుంబ సభ్యులు, గ్రామస్థుల మధ్య అనుబంధాలను పటిష్ఠమవుతాయి. గ్రామ బాధ్యతను అంతా అవగాహన చేసుకుంటారు. ఈ పండగ తమలో ఆనందోత్సవాలను నింపుతుందని గిరిజనులు చెబుతున్నారు.

గిరిజన సంస్కృతికి ప్రతీక..

ఇటుక పండగ గిరిజన సంస్కృతికి ప్రతీక. మా సంప్రదాయాలు, బాధ్యతలను తెలుసుకోవడానికి వీలుంటుంది. ఈ పండగ పితృదేవతలు, జీవన విధాన ఆచారాలకు సంబంధించినది. అందువల్ల ఈ పండగను ఘనంగా నిర్వహిస్తాం.

- మజ్జి కన్నయ్య, కూనంబందవలస

ఎలా జీవించాలో తెలుస్తుంది..

మా పూర్వీకులు ఎలా జీవించారో ఈ పండగ తెలుపుతుంది. అడవుల్లో ఎలా ఉండాలో కూడా నేర్పుతుంది. పూర్వీకులను పూజించడం ప్రతి ఒక్కరి బాధ్యత.

- సొండి లక్ష్మి, పణుకువలస

ఇప్పలపోలమ్మ పండగ ఖరారు

పార్వతీపురంటౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర ప్రజల ఇలవేల్పు ఇప్పలపోలమ్మ గ్రామ దేవత పండగను ఉత్సవ కమిటీ సభ్యులు ఖరారు చేశారు. సోమవారం సాయంత్రం ఉత్సవ కమిటీ సభ్యులు ఇప్పలపోలమ్మ ఆలయం వద్ద నుంచి రాజు గారి కోటలో గల దుర్గాదేవి ఆలయం వరకు పండగ చాటింపు నిర్వహించారు. రాత్రి 7 గంటల సమయంలో రాజుగారి కోటలోని దుర్గాదేవి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ జూన్ 1, 2, 3 తేదీల్లో ఇప్పలపోలమ్మ పండుగ నిర్వహిస్తామని తెలిపారు. 3వ తేదీ మంగళవారం సాయంత్రం నిర్వహించనున్న సిరిమానోత్సవానికి ప్రతిఒక్కరూ హాజరు కావాలని కోరారు. ఈనెల 21వ తేదీ నుంచి పండగ చాటింపు చేస్తామని చెప్పారు.

తహసీల్దార్ కార్యాలయం చుట్టూ చెట్ల తొలగింపు



తహసీల్దార్ కార్యాలయం వద్ద చెట్లు తొలగించిన దృశ్యం

భామిని, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): భామిని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో చెట్లు తొలగించడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న తహసీల్దార్ ఆదేశాల మేరకు కార్యాలయాన్ని కొత్తగా తీర్చిదిద్దేందుకు గోడలకు సున్నాలు వేశారు. గదుల్లో ఫ్యాన్లు, బల్బులు, కిటికీలకు మెస్‌లు, సిబ్బందికి కుర్చీలు, టేబుళ్ల ఏర్పాటు చేశారు. ఇంతవరకూ బాగానే ఉంది కానీ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న చెట్లను తొలగించాలని ఆదేశించారు. దీంతో గత రెండు రోజుల్లో మొత్తం చెట్లన్నీ తొలగించేశారు. ఎన్నో ఏళ్లగా ఉన్న ఈ చెట్లను తొలగించడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సిబ్బంది వద్ద ప్రస్తావించగా పరిసరాలు ప్రాంగణంలో గ్రావెల్ వేసి బౌండ్రీవాల్ నిర్మించి, కొత్త చెట్లు నాటుతామని తెలిపారు.

ప్రమాదాల నివారణకు సహకరించాలి

సీతంపేట రూరల్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఆటో ప్రమాదాల నివారణకు డ్రైవర్లు సహకరించాలని సీతంపేట ఎస్ఐ వై.అమ్మనరావు సూచించారు. సోమవారం వారపుసంత ఆవరణలో ఆటో డ్రైవర్లకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం తాగి ఆటోలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సంజీవరావు, ట్రైనీ ఎస్ఐలు పాల్గొన్నారు.

సామూహిక మరుగుదొడ్లు ప్రారంభం

బలిజిపేట, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): చిలకలపల్లి ఇందిరానగర్ కాలనీలో జర్మనీకి చెందిన ఫౌంటేలీస్ సంస్థ ఆర్థిక సహకారంతో స్కోప్ సంస్థ నిర్మించిన సామూహిక మరుగుదొడ్లను సోమవారం ప్రారంభించారు. అలాగే ఈ సంస్థ 55 మంది లబ్ధిదారులకు వ్యక్తిగత మరుగుదొడ్లు, కాలనీవాసులకు శుద్ధజల ప్లాంటు నిర్మించింది. సుమారు కోటి రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో రూ.30లక్షలతో సామూహిక మరుగుదొడ్లు, రూ.20 లక్షలతో శుద్ధ ప్లాంటు, రూ.10లక్షలతో సామాజిక భవనం, సుమారు రూ.25 లక్షలతో వ్యక్తిగత మరుగుదొడ్లు 55 మంది లబ్ధిదారులకు నిర్మించి అందించారు. ఒక్కో వ్యక్తిగత మరుగుదొడ్డికి రూ.50 వేలతో చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక జడ్పీటీసీ అలజంగి రవికుమార్, సర్పంచ్ అలజంగి సుందరరావు, రాష్ట్ర దాసరి బీసీ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ రంగుముద్రి రమాదేవి, ఎంపీటీసీ సభ్యురాలు మల్లిక, గ్రామ పెద్దలు తప్పిడి ప్రసాదరావు, ఎన్వీ జగన్నాథరావు మాస్టారు, స్వచ్ఛభారత్ కన్సల్టెంట్ టి.సుధా పాల్గొన్నారు.

ఘనంగా ఒడిశా నూతన సంవత్సర వేడుకలు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న వైశ్యులు

రాయగడ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఒడియా వాసుల నూతన సంవత్సర వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జగన్నాథ మందరం వద్ద భీమబో బంధుమిలన్ కమిటీ అధ్యక్షుడు నిరంజన్ బక్షిపాత్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. పానకం వితరణ చేశారు. స్థానిక న్యూకాలనీలో కళింగవైశ్య అధ్యక్షుడు కింతలి అమరనాథ్ ఆధ్వర్యంలో పానకం వితరణ చేశారు. వైశ్య ప్రముఖులు రాఘవకుమార్ కుముందాన్, టి.జయరాం, ఇప్పిలి రాజు, చిన్నారి విజయ్‌కుమార్, లాడిరాజు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలపై లడక్‌కు పయనం

ఒడిశా

రాయగడ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాయగడ జిల్లా కాశీపూర్ సమితి టికిరికి చెందిన అబ్దుల్ ఫెష్‌ఖాన్, మిథున్ సాహు అనే ఇద్దరు యువకులు రాయగడ నుంచి లడక్ యాత్రకు ద్విచక్ర వాహనాలపై సోమవారం బయలు దేరారు. వీరు దేశంలోని వివిధ రాష్ట్రాల మీదుగా సుమారు 15 వేల కిలోమీటర్ల దూరం పయనించి లడక్‌లోని ఉమిలింగలా ప్రాంతం వద్ద ఉన్న ఎత్తయిన మోటర్‌బుల్ పాస్ వద్దకు చేరుకోనున్నట్టు తెలిపారు. మాదక ద్రవ్యాలు సేవించరాదని ప్రజలకు చైతన్య పరుస్తామన్నారు.

అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం

రాయగడ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని అదనపు కలెక్టర్ నవీన్‌చంద్ర నాయక్ అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం స్థానిక అటానమస్ కళాశాలలో ఆయన చిత్రపటానికి అదనపు కలెక్టర్ పూలమాల వేసి, నివాళి అర్పించారు. సబ్ కలక్టర్ రమేష్‌జెన్నా, ప్రిన్సిపాల్ సరస్వతి రే, పూర్వ ప్రిన్సిపాల్ బాబిలత షారాఫ్, జిల్లా ప్రజా సంబంధాల అధికారి బసంతకుమార్ ప్రధాన్ పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

- వాడవాడలా రాజ్యాంగ నిర్మాత జయంతి వేడుకలు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా వేడుకలు నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, అధికారులు, వివిధ సంఘాల నేతలు, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



కురుపాం: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి



పాలకొండ: ఏలాం కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ



పార్వతీపురం: ముంబైలోని చైత్యభూమి వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర



సాలూరు: మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్



బెలగాం: అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న రెండో అదనపు జిల్లా న్యాయాధికారి దామోదరరావు



బెలగాం: అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పైపులైన్ల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గరుగుబిల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): శివ్వాం గ్రామంలో జల జీవన్ మిషన్‌కు సంబంధించిన అక్రమంగా ఏర్పాటుచేసిన పైపులైన్లను అధికారులు సోమవారం తొలగించారు. గ్రామానికి చెందిన పలువురు రైతులు తాగునీరు సరఫరా చేసే ప్రాంతంలోని పైపులైన్‌కు గండి కొట్టి పెరటి తోటలకు సాగునీరును మళ్లించారు. దీంతో గ్రామంలోని పలు వీధులకు తాగునీరు సరఫరా కాని పరిస్థితి ఏర్పడింది. గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 13న ఆంధ్రజ్యోతిలో పర్యవేక్షణ లేక.. పక్కదారి పట్టి శీర్షికన కథనం వెలువడింది. ఈ కథనంపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి బంటు అప్పారావు, సర్పంచ్ ప్రతినిధి రాయల పెంటయ్యలు అక్రమ పైపులైన్లను తొలగించారు. ఎంపీడీవో జి.పైడితల్లి ఆదేశాల మేరకు పర్యవేక్షణ చేసి పూర్తిస్థాయిలో తాగునీరందేలా చర్యలు చేపడుతున్నారు.

అంబేడ్కర్ ఆశయాలతో మోదీ పాలన

బెలగాం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అంబేడ్కర్‌ను గౌరవిస్తూ ఆయన ఆశయసాధనకు అనుగుణంగా ప్రధాన మంత్రి మోదీ పాలన కొనసాగుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో శ్రీనివాస్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పరిపాలనలో అంబేడ్కర్ విశిష్టతను గుర్తించలేదని, అప్పట్లో అంబేడ్కర్‌ను కాంగ్రెస్ రెండు సార్లు ఓడించిందని గుర్తు చేశారు. వక్ఫ్ బిల్లు రద్దు చేయడం హర్షణీయమని, ఈనెల 18న జిల్లాలో మేధావులతో చర్చ నిర్వహిస్తామని చెప్పారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో గోశాలపై వైసీపీ అనవసర రాజకీయం చేస్తోందని ఆయన విమర్శించారు.

దేవస్థానం అభివృద్ధికి విరాళం

గరుగుబిల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాల అభివృద్ధికి దాతలు ముందుకు వస్తున్నారని ఆలయ అభివృద్ధి సేవా ట్రస్ట్ కార్యదర్శి డి.పారినాయుడు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ విశాఖ కేజీహెచ్ ఆసుపత్రిలో పిడియాట్రిక్స్ సర్జరీ విభాగాధిపతి ప్రొఫెసర్ గొర్తి రాజేంద్రప్రసాద్, డాక్టర్ పద్మావతి దంపతుల ద్వారా డాక్టర్ గొర్తి కామశాస్త్రి, విజయలక్ష్మి దంపతులు లక్ష రూపాయలు, అలాగే జి.సత్యనారాయణ, సుభద్రమ్మ దంపతుల పేరుతో లక్ష రూపాయలు అందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో యిండుపూరు విజయ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రెండు కేజీలు తగ్గాయి

- రేషన్ బియ్యం పంపిణీలో కోత
- సీఎస్‌డీటీ విచారణ.. పూర్తి స్థాయిలో సరఫరా

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కాశిందొర వలస పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాల్లో అంత్యోదయ కార్డులు కలిగిన గిరిజనులకు రేషన్ బియ్యం పంపిణీలో డీలర్ చేతివాటం చూపుతున్నారని, తక్కువ బియ్యం తూకం వేసి అందిస్తున్నారని కార్డుదారులు ఆరోపించారు. కాశిందొరవలస, దొంగురువలస, ఎరకం దొరవలస గ్రామాలకు చెందిన 155 మందికి ప్రభుత్వం అంత్యోదయ కార్డులను మంజూరు చేయగా ఒక్కో కార్డు దారునికి 35 కేజీల బియ్యం, నిత్యావసరాలు అందించాల్సి ఉంది. అయితే ఏప్రిల్ నెలకు సంబంధించిన బియ్యం పంపిణీలో ప్రతి కార్డుదారునికి రెండు కేజీల చొప్పున డీలర్ తక్కువ అందజేశారు. దీంతో వినియోగదారులంతా ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న సీఎస్‌డీటీ రెడ్డి సాయికృష్ణ హుటాహుటిన గ్రామానికి చేరుకుని రేషన్ బియ్యం కోతపై విచారణ చేశారు. రేషన్ బియ్యం పంపిణీలో ఎటువంటి అక్రమాలకు తావు ఉండరాదని డీలర్ లచ్చుందొరను ఆయన హెచ్చరించారు. కార్డుదారులకు తగ్గిన బియ్యాన్ని మళ్లీ అందజేశారు.

- ఈసందర్భంగా సీఎస్‌డీటీ మాట్లాడారు. ప్రతినెల కార్డుదారులు అందుకుంటున్న బియ్యం, ఇతర సరుకుల వివరాల నివేదికను ప్రభుత్వానికి పంపిస్తుంటామని చెప్పారు. అయితే గత నెలలో సదరు రేషన్ డీలర్ నుంచి తక్కువమంది కార్డుదారులు బియ్య తీసుకోవడంతో ప్రభుత్వం అంతే మొత్తం ఈనెల మంజూరు చేసిందని ఆయన వివరించారు. దీంతో బియ్యం పంపిణీలో కోత పడిందని, విషయం తెలుసుకుని విచారించి, కార్డుదారులందరికీ పూర్తిస్థాయిలో బియ్యం పంపిణీ చేశామన్నారు.

జారి పడిన ఎక్స్‌కవేటర్.. నిలిచిన విద్యుత్ సరఫరా

సాలూరు రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ట్రాలీ లారీపై తరలిస్తున్న ఎక్స్‌కవేటర్ జారి పడి విద్యుత్ స్తంభంపై పడడంతో ఓ గిరిజన గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వివరాలిలా ఉన్నాయి. పట్టుచెన్నారు మార్గంలో ఆదివారం రాత్రి ట్రాలీ లారీపై ఎక్స్‌కవేటర్‌ను తరలిస్తున్నారు. ఘాట్ రోడ్డులోని కొండంగివలస సమీపాన గల ఓ మలుపు వద్ద ఎక్స్‌కవేటర్ ట్రాలీ నుంచి జారి పడి ఓ విద్యుత్ స్తంభంపై పడింది. ఈ ప్రమాదంతో ఎవరికి గాయాలు కాలేదు. ఆ విద్యుత్ స్తంభం మాత్రం విరిగిపోయింది. విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో అడ్డుగుడ అనే గిరిజన గ్రామానికి గత రెండు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇప్పటికీ పునరుద్ధరణ కాలేదు. తమకు ప్రత్యామ్నాయ మార్గంలో విద్యుత్ సరఫరా చేయాలని గిరిజనులు కోరుతున్నారు.



విద్యుత్ స్తంభంపై పడిన ఎక్స్‌కవేటర్

జనసేన నాయకునిపై దాడి అమానుషం

బొబ్బిలి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రామభద్రపురం గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకుడు మహంతి ధనుంజయ్‌పై ఆ గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త పాశవికంగా దాడి చేసి, హత్యాయత్నానికి పాల్పడడం క్షమించరానిదని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి అన్నారు. స్థానిక జనసేన కార్యాలయంలో ఆయన సోమవారం మాట్లాడారు. కోట్లాది రూపాయల ప్రభుత్వ భూమిని వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమంగా కబ్జా చేసి, లావాదేవీలు జరపడాన్ని ధనుంజయ్ తీవ్రంగా వ్యతిరేకించి పలు పోరాటాలు చేశారన్నారు. ఆయనకు మద్దతుగా తాను కూడా నిలిచానని, సీపీఎం నాయకులు మద్దతు పలికారన్నారు. ఈ అక్రమ భూమి లావాదేవీలకు సంబంధించి హైకోర్టులో వ్యాజ్యం కూడా వేశామని తెలిపారు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా వైసీపీ నాయకులు మళ్లీ బరితెగించి ఇలా దాడులకు దిగడం సభ్యసమాజం అంగీకరించబోదన్నారు. ధనుంజయ్‌పై దాడి చేసిన నిందితుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ధనుంజయ్‌కు పూర్తిస్థాయి న్యాయం జరిగేవరకు మద్దతుగా నిలుస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న అప్పలస్వామి

న్యూస్ బాక్స్

మెరుగైన పారిశుధ్యానికి సహకరించండి

పాలకొండ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మెరుగైన పారిశుధ్యానికి ప్రజలు సహకరించాలని నగర పంచాయతీ కమిషనర్ జయరాం అన్నారు. ఆయన సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. షాపుల యజమానులు షాపుల వద్ద విధిగా 65 లీటర్ల కెపాజిటీ ఉన్న డస్ట్‌బిన్లను ఏర్పాటు చేయాల న్నారు. రోడ్డు మీద చెత్తను వేయకుండా ఆ బిన్‌లో వేయాలని సూచించారు. పారిశుధ్య కార్మికులకు మాత్రమే వాటిని అందించాలన్నారు.

ఆశీర్వాద పండగలో ఎమ్మెల్యే

కురుపాం రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): గొటివాడ గ్రామంలో నిర్వహిస్తున్న క్రైస్తవుల ఆశీర్వాద పండగలో కురుపాం ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి సోమవారం పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు.

కోటదుర్గమ్మకు వెండి కమండలం బహూకరణ

పాలకొండ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పాలకొండ కోటదుర్గమ్మ అమ్మవారికి శ్రీకాకుళం నగరానికి చెందిన సీహెచ్‌వీ విద్యాసాగర్, లలితాదేవి దంపతులు వెండి గోముఖ కమండలాన్ని వితరణ చేశారు. 401 గ్రాముల 800 మిల్లీ గ్రాముల వెండి కమండలాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు దార్లపూడి లక్ష్మీ ప్రసాదశర్మకు వారు సోమవారం అందజేశారు.

దాతల సహకారంతో బస్‌షెల్టర్ ఏర్పాటు



పూర్తయిన బస్‌షెల్టర్

వీరఘట్టం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రేగులపాడు జంక్షన్‌లో దాతల సహకారంతో బస్‌షెల్టర్ నిర్మించారు. పాత బస్‌షెల్టర్ పాడవడంతో ప్రయాణికులు రోడ్డుపైనే బస్సు కోసం నిరీక్షించాల్సి వచ్చేది. దీంతో కత్తులకవిటి గ్రామానికి చెందిన దివంగత గేదెల కృష్ణమూర్తినాయుడు, సరోజని దంపతుల కుమారులు జవహర్‌లాల్‌నెహ్రూ, మహేన్‌కుమార్, హిమాన్స్‌కుమార్, రవి ప్రసన్నకుమార్‌లు బస్‌షెల్టర్ నిర్మించారు. బస్‌షెల్టర్ అందుబాటులోకి రావడంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రవీణ్ ఆత్మకు శాంతి చేకూరాలని..

- క్రైస్తవుల శాంతియుత ర్యాలీ

పార్వతీపురంటౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ జిల్లా క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పాతబస్టాండ్ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆ సంఘ నాయకులు మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం, భద్రతకు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలను తీసుకురావాలని కోరారు.



శాంతియుత ర్యాలీలో పాల్గొన్న జిల్లా క్రైస్తవ సంఘాల సభ్యులు

రాళ్లు తేలిన దారిలో అవస్థలు

- పార్వతీపురం-పాలకొండ రోడ్డులో రేగుతున్న ధూళి
- పనులు పూర్తి చేయాలని కోరుతున్న వాహనదారులు



రహదారిపై రాళ్లు తేలడంతో పాటు ధూళి రేగుతున్న దృశ్యం

గరుగుబిల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం నుంచి పాలకొండ వెళ్లే ప్రధాన రహదారిలో వాహనచోదకులకు అవస్థలు తప్పడం లేదు. గతంలో ఈ రహదారి అధ్వానంగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉల్లిభద్ర ప్రాంతంలో ప్రధాన రహదారికి రూ.1.50 కోట్లు, పార్వతీపురం మండలం అడ్డాపుశీల నుంచి కొత్తవలస వరకు ఉన్న రహదారి మెరుగుకు రూ.40 లక్షలు నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు ఈనెల 4న రహదారి పనులు ప్రారంభించారు. ప్రస్తుతం రహదారిపై రాళ్లు వేసి రోలింగ్ చేస్తున్నారు. అయితే అధికంగా రాళ్లు తేలడంతో వాహనదారులు ప్రయాణం చేసేందుకు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు ధూళి రేగడంతో ప్రమాదాలు నెలకొంటున్నాయి. సంబంధిత అధికారులు దృష్టి సారించి రహదారి పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

- అమరవీరులకు నివాళులర్పించిన సిబ్బంది

బెలగాం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ అగ్నిమాపక వారోత్సవాలను స్థానిక అగ్నిమాపక కేంద్రంలో సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా జిల్లా అగ్నిమాపక అధికారి కె.శ్రీనుబాబు మాట్లాడుతూ 1944లో ముంబాయి డాక్ యార్డులో సంభవించిన అగ్నిప్రమాదంలో 66 మంది అగ్నిమాపక సిబ్బంది అమరువీరులయ్యారు. వారి త్యాగాన్ని స్మరించుకుంటూ అగ్ని ప్రమదాలపై ప్రజలను చైతన్యం చేయడానికి ప్రతి ఏడాది ఏప్రిల్ 14 నుంచి 20 వరకు జాతీయ మాపక వారోత్సవాలు నిర్వహిస్తారని తెలిపారు.





పాలకొండ: అమరువీరులకు నివాళులు అర్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది, బెలగాంలో..

అనంతరం అమరవీరులకు నివాళి అర్పించారు.

- పాలకొండ: జాతీయ అగ్నిమాపక దినోత్సవాన్ని పాలకొండ అగ్నిమాపక కేంద్రంలో సోమవారం నిర్వహించారు. అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు. అమరవీరులకు నివాళి అర్పించారు.

బకాయిలు చెల్లించక.. రసీదులు ఇవ్వక

●పంచాయతీల ఆదాయానికి గండి ●ఇదీ గజపతినగరం, పురిటిపెంటల్లో ఆశీలు వసూల పరిస్థితి



గజపతినగరంలోని కూరగాయల మార్కెట్

గజపతినగరం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి):గజపతినగరం, పురిటిపెంట పంచాయతీల్లో ఆశీలునిర్వహణ గాడితప్పుతోంది.ప్రధానంగా పాటదారులు బకాయిలు చెల్లించకపోవడంతో పంచాయతీల ఆదాయానికి గండిపడుతోంది. అంతేకాకుండా ఆశీలు నిర్వాహకులు రసీదులు ఇవ్వడంలేదని వ్యాపారులు వాపోతున్నారు.

రికవరీ చేయకపోవడంతో..

గజపతినగరంతోపాటు పురిటిపెంట పంచాయతీలకు ఆశీలవేలం పాటద్వారా ఏటా రూ.లక్షల్లో ఆదాయం గండిపడుతోంది. పాటదారులు సిండికేట్ కావడంతో ఏటేటా వేలం మొత్తాన్ని తక్కువకు పాడుతున్నారు. అయితే పాడిన మొత్తాన్ని కూడా కాంట్రాక్టర్లు చెల్లించడంలేదని పంచాయతీ అధికారులు చెబుతున్నారు. ప్రతిఏటా ఆశీలుపాట పాడిన పాటదారులు ఏడాదికాలంలో వసూలు చేసుకున్నా పంచాయతీలకు మాత్రం బకాయిలు చెల్లించడంలేదు. పంచాయతీ అధికారులు నిబంధనల ప్రకారం పాట నిర్వహించకపోడం వల్లే బకాయిలు పేరుకుపోతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకఏడాది పాడిన పాటదారుడు నిబంధనల ప్రకారం ఆశీల సొమ్ముమూడు విడతల్లో చెల్లించాలి. పంచాయతీలకు బకాయిలు చెల్లించక రెండో ఏడాది పాటసమయానికి తప్పుకుంటున్నారు.ఈనేపథ్యంలో పంచాయతీ అధికారులు బకాయిదారులకు నోటీసులిచ్చి వారి నుంచి రికవరీ చేయకపోవడంతో ఏటా లక్షలాది రూపాయలు ఆదాయానికి గండిపడుతోంది. ప్రధానంగా గజపతినగరంలోని చంపావతి వంతెన నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు జాతీయరహదారికి ఇరువైపులా ఉన్న షాపుల నుంచి, కూరగాయలు, చేపల మార్కెట్, వాహనాల లోడింగ్, అన్‌లోడింగ్ ఇసుక బళ్లు, ట్రాక్టర్లు తదితర వాటిపై ఆశీలు రూపంలో వసూళ్లు చేస్తుంటారు. అయితే రెండు పంచాయతీల్లోనూ ఆశీలు వసూళ్లు చేస్తున్న వారు తమకు ఎటువంటి రశీదులు ఇవ్వడంలేదని వ్యాపారులు చెబుతున్నారు.వ్యాపారాలు ఆధారంగా, వాహనాల లోడింగ్ అన్ లోడింగ్‌కు సంబంధించి ధరల పట్టికను పంచాయతీ కార్యాలయాల్లో ఉంచాలని, ఆవిధంగా చేయడంలేదని ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలు తీసుకువస్తే తట్టకు రూ. 10 వసూళ్లు చేయడం శోచనీయమని రైతులు వాపోతున్నారు

ఇదీ పరిస్థితి

గజపతినగరం పంచాయతీకి సంబంధించి 2019-20 నుంచి 2023-24వరకు ఆరుగురు పాటదారులు ఆశీలవేలంపాటపాడగా పంచాయితీకి 14లక్షల 70వేలు రావల్సిఉంది. అయితే ఇంతవరకు 8,86,500 చెల్లించగా 5,83, 500బకాయిలు చెల్లించాల్సిఉంది. పురిటిపెంట పంచాయతీకి సంబంధించి 2016-17నుంచి 2024-25వరకు 17,18,500 పాటదారుల నుంచి ఆశీలుపాట ద్వారా రావల్సిఉన్నా ఇంతవరకు 5,80, 750 పంచాయతీకి జమకాగా బకాయిలు 11,37,750 చెల్లించాల్సి ఉంది.

బకాయిదారులకు నోటీసులిచ్చాం

పాత బకాయిలు చెల్లించాలని పంచాయతీ అధికారులకు సూచించామని ఈవోపీఆర్డీ సుగుణాకరరావు తెలిపారు. గజపతినగరం పంచాయతీకి సంబంధించి 5లక్షల83వేలు, పురిటిపెంట పంచాయతీకి 11లక్షల 37వేల బకాయిలు రావల్సిఉందని చెప్పారు. బయిలు పెట్టిన పాటదారులకు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు.

రేపు కన్స్యూమర్ గ్రీవెన్స్

గంట్యాడ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): గంట్యాడ సబ్‌స్టేషన్‌లో కన్స్యూమర్ గ్రీవెన్స్ న్యాయస్థానం క్యాంప్ కోర్టు కార్యక్రమాన్ని బుధవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకూ నిర్వహించనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పి.త్రినాథరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.విద్యుత్ వినియోగదారులు ఎటువంటి సమస్యఉన్నా నేరుగా తెలియజేయాలని కోరారు.

రేపు వైద్య శిబిరం

కొత్తవలస, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి) : కొత్తవలసలో బుధవారం సుబ్బలక్ష్మి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కనకాల శివ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గైనిక్, కంటి, గుండె, ఎముకలతోపాటు సాధారణ రోగాలకు పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

17న డీఎస్సీపై సదస్సు

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని గురజాడ లైబ్రరీలో ఈనెల 17న జరగనున్న డీఎస్సీ సదస్సును జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ ఉపాధ్యక్షుడు బి.సతీష్ కోరారు. సోమవారం విజయనగరంలోని కోట సమీపంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు రాము మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి హోదాలో తొలి సంతకం పెడతానన్న హామీ విషయంలో డీఎస్సీ అభ్యర్థులను మోసం చేశారన్నారు. పది నెలలు గడిచినా తొలి సంతకం అమలు చేసే దిక్కేలేదని ఆరోపించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ ప్రతినిధులు సంతోష్, రాము, వెంకటేష్, డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

27న విశాఖలో సభ

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర రజకుల అభినందన సభ ఈనెల 27న విశాఖలో నిర్వహించనున్నట్లు రజక కార్పొరేషన్ డైరక్టరు రాము తెలిపారు. సోమవారం విజయనగరంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వం రజకుల సమస్యలను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. సమావేశంలో మలిచర్ల చిట్టితల్లి, సత్యం, నాగారాజు తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి సంగీతంపై శిక్షణ

విజయనగరం రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కొత్తఅగ్రహారంలోని రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ ద్వారా ఈనెల 28 నుంచి జూన్ ఆరో తేదీ వరకూ సంగీత వసంతం పేరిట వేసవి సంగీత శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు అకాడమీ ప్రిన్సిపాల్ మండపాక రవి తెలిపారు. సోమవారం విజయనగరంలో శిక్షణకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి రోజూ 5.30 నుంచి 7.30 గంటల వరకూ శిక్షణ ఉంటుందని తెలిపారు.

గ్రేడ్ -2 హెచ్ఎంలుగా పదోన్నతికి సీనియారిటీ జాబితా

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ యాజమాన్యంలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు గ్రేడ్ -2 గెజిటెడ్ హెచ్ఎంలుగా పదోన్నతి కోసం తాత్కాలిక సీనియార్టీ జాబితా ప్రచురించినట్లు డీఈవో మాణిక్యం నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈమేరకు అభ్యంతరాలు ఉంటే ఈనెల 19 తేదీ ఉదయం 10.30 నుంచి సాయంత్రం ఐదు గంటల్లోగా విశాఖలోప్రాంతీయ సంయుక్త సంచాలకులకు అందజేయాలని కోరారు.

సంతకవిటి ఎస్ఐపై దాడి

సంతకవిటి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జావాం పగడాలమ్మ జాతరలో రెండు వర్గాల మధ్య జరిగిన వివాదంలో ఎస్ఐ ఆర్. గోపాలరావుపై ఓ యువకుడు దాడిచేశాడు. ఎస్ఐ, పోలీసులు గొడవను సద్దుమణిగించే క్రమంలో ఓ యువకుడు వెనుక నుంచి అనుకోకుండా చేయిచేసుకున్నట్లు తెలుస్తోంది. కాగా తాను గొడవను సద్దుమణిగించే క్రమంలో ఓ యువకుడు తనను వెనక నుంచి పట్టుకొని తోసెయ్యబోయాడని, ఇదే విషయంపై కేసు కూడా నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



రాజాం:అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభిస్తున్న జనార్దనరావు

గజపతినగరం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక కేంద్రఅధికారి ప్రసాద్‌రాజు కోరారు. సోమవారం స్థానిక అగ్నిమాపక కేంద్రం కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాలు పురస్కరించుకుని అమర జీవులకు నివాళులర్పించారు.కార్యక్రమానికి గ్రామకార్యదర్శి జనార్దనరావు పాల్గొన్నారు.

● శృంగవరపుకోట, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో మృతి చెందిన ఉద్యోగులకు శృంగవరపుకోట అగ్నిమాపక శాఖ సిబ్బంది నివాళులర్పించారు. సోమవారం జాతీయ అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో అగ్నిమాప క శాఖాధికారి షేక్ మదీనా పాల్గొన్నారు.

●రాజాం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి):అగ్నిప్రమాదాలు జరగకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడానికే వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విపత్తుల స్పందన రాజాం అగ్ని మాపక అధికారి టీఎస్ఎస్ జనార్దనరావు తెలిపారు. రాజాం అగ్ని మాపక వారోత్సవాలు ప్రారంభించారు. అగ్ని ప్రమాదం జరిగితే టోల్ ఫ్రీ నెంబరు 0891-251099 లేదా 100, 101, 108, 104 నెంబర్లకు తెలియజేయాలని సూచించారు.కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్య కుమార్, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

విజయనగరంలో లాన్ టెన్నిస్ పోటీలు



లాన్‌టెన్నిస్ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానంచేస్తున్న నిర్వాహకులు

విజయనగరం రూరల్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని సిటీక్లబ్ వేదికగా పదేళ్ల విరామం తర్వాత నిర్వహించిన లాన్ టెన్నిస్ పోటీలు సోమవారం ముగిశాయి. రెండురోజుల పాటు సింగిల్స్, డబుల్స్ విభాగంలో జరిగిన ఈ పోటీలకు సంబంధించి అండర్-12, అండర్-16, 30 ప్లస్, 40 ప్లస్, 50 ప్లస్ విభాగాల్లో జిల్లా వ్యాప్తంగా 62 మంది పాల్గొన్నారు.ఈమేరకు అండర్-12 జూనియర్స్ విభాగంలో ఎస్.కార్తిక్ రామ్, టి.సాయి చేతన్ జయరామ్, అండర్-16 విభాగంలో పి.సుజిత్, జాస్మిన్ విజయం సాధించారు. 30 ప్లస్ సింగిల్స్ విభాగంలో ఎస్. ప్రశాంత్, మహేష్, 30 ప్లస్ డబుల్స్ విభాగంలో బి.మహేష్, సీహెచ్ హరీష్, ఎస్.ప్రశాంత్, బి.రాహుల్, 40 ప్లస్ సింగిల్స్ విభాగంలో సుదర్శన్, మల్లి, బి.రఘునాథ్, ఎం.మధు, 50 ప్లస్ విభాగంలో జీవీసన్యాసిరాజు, పీఎస్ రాజు, టి.రామారావు, కేవీ రామారావు విజయం సాధించారు. సిటీక్లబ్ ప్రతినిధులు రంగారావు దొర, సన్నిబాబు దొర, సీనియర్ టెన్నిస్ క్రీడాకారులుసన్యాసిరాజు, రామారావు, శంకరరావులతో పాటు గంటా వైభవ్, కౌశిక్, సాత్విక్ తదితరులు పోటీల నిర్వహణలో ప్రధాన పాత్ర పోషించారు.

ఎన్ఎంఎంఎస్ యాప్‌లో హాజరువేయాలి

రేగిడి, ఏప్రిల్ 14, (ఆంధ్రజ్యోతి): వేతనదారులు రెండుపూటలా ఆరుగంటలకు తక్కువకాకుండా పనిచేయాలని, ఎన్ఎంఎంఎస్‌యాప్‌లో హాజరువేయాలని ఏపీవో ఎస్.హరినాథ్ కోరారు. సోమవారం మండలంలోని పెద్దశిర్లాంలో పాలవలసవాని చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వేతనదారులు రోజుకు ఆరుగంటలు కొలతల ప్రాప్తికి పనిచేస్తే రూ.307 వేతనం వస్తుందని తెలిపారు. ఒకరికి బదులు మరొకరిని పనికి అనుమతించొద్దని కోరారు.

మునిసిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

●మునిసిపల్ వర్కర్స్ అండ్ ఈయూ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తినాయుడు

రాజాం రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికులను ఆప్కాస్ నుంచి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించే చర్యలను రాష్ట్ర ప్రభుత్వం విడనాడాలని, కార్మికుల ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని రాజాం మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తి నాయుడు డిమాండ్ చేశారు. సోమవారం రాజాంలోని అంబేడ్కర్ విగ్రహానికి మునిసిపల్ కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేసే ప్రయత్నంలో ఉందని, అలాచేస్తే కాంట్రాక్టర్ల వద్ద కార్మికులు బానిసలుగా మారాల్సిన దుస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. దశాబ్దాలుగా పనిచేస్తున్న కార్మికును పర్మినెంట్ చేయకుండా కాంట్రాక్ట్ పేరుతో వెట్టిచాకిరీ చేయించుకుంటోందని ఆరోపించారు.

ఎక్సైజ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్

విజయనగరం క్రైం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): విజయనగరం ఎక్సైజ్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎం.చంద్రశేఖర్ ఎక్సైజ్ కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు జిల్లా అసోసియేట్ ప్రెసెడెంట్ జయరామనాయుడు తెలిపారు. జోనల్ కార్యదర్శిగా టి.శేషగిరి ఎన్నికైనట్లు పేర్కొన్నారు.ఈ మేరకు చంద్రశేఖర్, శేషగిరిలను జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు జయరామ్‌నాయుడు, ప్రెస్ కార్యదర్శి గంగాధరుడు అభినందించారు.

పేస్కేల్ అమలు చేయాలి



చీపురుపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

చీపురుపల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పేస్కేల్ అమలు చేయాలని, కనీసం 26 వేల వేతనం ఇవ్వాలని వీఆర్ఏలు కోరారు.ఈ మేరకు తమ సమస్యలు పరిష్కరించాలని మండలంలోని వీఆర్ఏలు సోమవారం చీపురుపల్లిలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తక్కువ వేతనంతో తమ కుటుంబాలను పోషించలేని పరిస్థితుల్లో ఉన్నామని ఆవేదన వ్యక్తంచేశారు. రాత్రి వేళ విధులను రద్దు చేయాలని, అర్హతలున్న వీఆర్ఏలకు పదోన్నతి కల్పించాలని కోరారు. వీరికి బహుజన సమాజ్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో దండి సూర్యనారాయణ, బి.ఆదినారాయణ, పి.లక్ష్మణ, శారద, తవిటయ్య, బీఎస్పీ నాయకులు అప్పలనాయుడు, అద్దూరి కృష్ణ, సబ్బి సత్యనారాయణ పాల్గొన్నారు.

వంగరలో షిర్డీసాయి బాబా ఆలయ వార్షికోత్సవం

వంగర, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):వంగరలోని షిర్డీసాయి బాబా ఆలయం మూడో వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ధర్మకర్త వెంకటనాయుడు, గ్రామ పెద్ద వాసుదేవరావు నాయుడు ఆధ్వర్యంలో భక్తులకు పూజా సామగ్రి ఉచితంగా పంపిణీ చేశారు.ఈసందర్భంగా అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి పల్లకి ఊరేగించారు.

గోపాలపల్లిలో అయ్యప్పస్వామికి పూజలు

శృంగవరపుకోట రూరల్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి):మండలంలోని గోపాలపల్లి శివాలయంలో సోమవారం అయ్యప్పస్వామి జయంతి పురస్కరించుకుని అయ్యప్ప స్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్య క్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆడారి ఉమమహేశ్వరరావు,ఉపసర్పంచ్ గణేష్, శివరామకృష్ణ పాల్గొన్నారు.

'ప్రజలు తిరస్కరించినా వైసీపీకి బుద్ధిరావడం లేదు'

కొత్తవలస, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలు వైసీపీని తిరస్కరించినా ఆ పార్టీ నాయకులకు బుద్ధిరావడం లేదని టీడీపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు బొబ్బిలి అప్పారావు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వంపై ఏదోవిధంగా బురద చల్లి అబాసుపాలు చేయాలని చూస్తూ ప్రతి విషయంలోనూ నవ్వులపాలవుతున్నారని చెప్పారు. సోమవారం కొత్తవలసలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీటీడీ గోశాలలో ఏమి జరగపోయినా గోవులు చనిపోయాయని విషప్రచారం చేశారన్నారు.పాస్టర్ ప్రవీణ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు సాక్ష్యాధారాలతో చూపించినా హత్య అని ప్రచారం చేసి నవ్వులు పాలయ్యారన్నారు. తమ పార్టీకి చెందిన కార్యకర్త కిరణ్ క్షణికావేశంలో వైఎస్‌భారతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేసి, కేసునమోదు చేసినట్లు తెలిపారు.

వైసీపీ హయాంలో లెక్కలేనన్ని పాపాలు: గద్దే

చీపురుపల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):మతపరమైన అరాచకాలన్నీ వైసీపీ హయాంలోనే జరిగాయని, వాటిని మరిచిపోయిన ఆ పార్టీ నాయకులు ఇప్పుడు ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిరుపతిలో గోవుల మృతిపై భూమన కరుణాకరరెడ్డి చేస్తున్న ఆరోపణలు విస్మయం కలిగిస్తున్నాయని తెలిపారు.వైసీపీ హయాంలో లెక్కలేనన్ని పాపాలు చేసినప్పటికీ, నేటికీ వాటిపై దర్యాప్తు లేదని పేర్కొన్నారు.

ఈశ్వర్‌ప్రసాద్‌కు అబ్దుల్‌కలాం అవార్డు

జామి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):మండలంలోని జాగరం గ్రామానికి చెందిన జిల్లా చెరువుల పరిరక్షణ సామాజిక ఉద్యమకార్యకర్త జాగరపు ఈశ్వరప్రసాద్ తమిళనాడులోని మదురైలో సోమవారం రాత్రి ఇంటర్నేషనల్ యునైటెడ్ అబ్దుల్ కలాం అవార్డును స్వీకరించారు. ఈసందర్భంగా ఈశ్వర్‌ప్రసాద్ మాట్లాడుతూ చెరువులను పరిరక్షించడంతోపాటు నీటివనరులను కాపాడడంతో, గురించి తాను చేస్తున్న అవగాహనకార్యక్రమాలకు జాతీయస్థాయిఅవార్డు లభించిందని తెలిపారు.

ఘనంగా వెదుళ్ల పైడితల్లి తొలేళ్లు


కొత్తవలస, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఏడు గ్రామాల ఆరాధ్య దైవం వెదుళ్ల పైడితల్లమ్మ తొలేళ్ల ఉత్సవాన్ని సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అనుపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. వీరభద్రపురం, నరపాం, కర్రిచిన్నయ్యపాలెం, వియ్యంపేట, ములగపాకవానిపాలెం, కొట్టానివానిపాలెం, గొల్లలపాలెం గ్రామ దేవతగా వెదుళ్ల పైడితల్లిని పూజిస్తుంటారు. ఏటా తొమ్మిది రోజుల పాటు ఈ పండగను నిర్వహిస్తారు. ప్రతిరోజూ ఈ ఏడు గ్రామాలలో జోగి దండుతారు. తొలేళ్లు, అనుపు కార్యక్రమాన్ని వీరభద్రపురంలో నిర్వహిస్తారు. ఉత్సవాల సందర్భంగా క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నారు.

నిధులు లేక.. పనులు పూర్తికాక

●ఇదీ కొండగండ్రేడు జిల్లా పరిషత్ పాఠశాలలో పరిస్థితి

గుర్ల, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండగండ్రేడు జిల్లా పరిషత్ పాఠశాల గదుల నిర్మాణం నిధుల కొరతతో నిలిచిపోయింది. దీంతో విద్యార్థులకు అగచాట్లు తప్పడం లేదు.

కొండగండ్రేడు జిల్లా పరిషత్ పాఠశాలలో 260 మంది విద్యార్థులు చదువుతున్నారు.ఐదేళ్ల కిందట గ్రామస్థులు పోరాడి పాఠశాలకు మంజూరుచేయించారు. ఈ నేపథ్యంలో గదులు చాలకపోవడంతో విద్యార్థులు అగచాట్లు పడుతున్నారు. వసతి సమస్యపై అధికారులు,ప్రజాప్రతినిధుల దృష్టికి పలుసార్లు తల్లిదండ్రులు తీసుకువెళ్లారు. దీంతో రూ.25 లక్షలతో భవనాలు మంజూరుచేసినా పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.కనీసం చుట్టూ ప్రహరీ పనులు కూడా పూర్తిచేయలేదు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి పాఠశాలదుస్థితిపై నివేదిక పంపినట్లు గ్రామస్థులు తెలిపారు.కాగా పాఠశాలలో భవనం పనులపై నివేదికను జిల్లా అధికారులకు అందజేసినట్లు హెచ్ఎం నారాయణరావు తెలిపారు. అలాగే భవనం నిర్మాణం పూర్తిచేయడానికి నిధుల కొరత ఉందని, అభివృద్ధి చేయవలసిన బాధ్యత అధికారులపై ఉందని సర్పంచ్ సారిక గోవింద చెప్పారు.



అర్ధాంతరంగా నిలిచిపోయిన కొండగండ్రేడు జిల్లా పరిషత్ పాఠశాల భవనం పనులు

చికిత్సపొందుతూ వృద్ధుడి మృతి

సంతకవిటి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండాకురిటికి చెందిన బోనెల లచ్చయ్య(79) శ్రీకాకుళంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడని ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపారు. ఈమేరకు అనుమానాస్పదస్థితిలో మృతిచెందినట్లు కేసునమోదు చేశామని చెప్పారు.ఎస్ఐ కథనం మేరకు.. లచ్చయ్య ఈనెల 12న చెరువుకు స్నానం చేయడానికి వెళ్లాడు. గ్రామంలోని చెరువు గట్టుపై బయటకు కనపడని దెబ్బలతో పడిపోయాడు. దీంతో కుటుంబసభ్యులు రాజాంలోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లగా, అక్కడ నుంచి శ్రీకాకుళం తరలించారు. ఈమేరకు అక్కడ ఓ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు.ఆసుపత్రి సిబ్బంది ఎమ్మెల్సీ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.లచ్చయ్య మృతిదేహాన్ని సోమవారం పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

పరారైన నిందితుడి అరెస్టు

తెర్లాం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా కేసులో గతంలో పరారైన ఓ నిందితుడ్ని పోలీసులు అరెస్టు చేశారు. బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు, తెర్లాం ఎస్ఐ సాగరబాబు కథనం మేరకు.. గతఏడాది వాహనాలు తనిఖీ సమయంలో రెండు కార్లలో 18.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగుర్ని అరెస్ట్ చేశారు.ఈ కేసులో అప్పట్లోనే ఇద్దరు పరారయ్యారు. రెండు కార్లతో పాటు గంజాయిని కూడా సీజ్ చేశారు. ఈనేపథ్యంలో ఈనెల 13న రామభద్రపురం బైపాస్ దగ్గర అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.గతంలో గంజాయిఅక్రమ రవాణాకేసులో పరారైన ఒడిశా రాష్ట్రంలోని పొట్టంగి మండలంలోని ఘటిగుడా గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించి అరెస్టుచేశారు. ఆయన నుంచి సెల్‌ఫోన్‌తో పాటు రూ.300 నగదు స్వాధీనం చేసుకుని సీజ్‌చేశారు. నిందితుడిని పట్టుకోవడానికి కృషిచేసిన తెర్లాం ఎస్ఐ సాగర్‌బాబు, సిబ్బందిని సీఐ అభినందించారు.

పశువుల తరలింపుపై కేసు నమోదు

లక్కవరపుకోట, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనాలపై ఎస్ఐ నవీన్‌పడాల్ సోమవారం దాడిచేసి కేసు నమోదు చేశారు. అలమండ సంతలో పశువులను కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తున్న వాహనాలను భీమాళి సమీపంలో ఎస్ఐ పట్టుకున్నారు. రెండు వాహనాల్లో 12 పశువులను తరలిస్తున్నారని తెలిపారు. ఇవి తెలంగాణ రాష్ట్రానికి తరలిస్తున్నట్లు తెలిసిందని, రెండు వాహనాలపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ చెప్పారు.

●జామి, ఏప్రిల్ 14 :మండలంలోని అలమండ సంత నుంచి వివిధ ప్రాంతాలకు నిబంధనలకు విరుద్ధంగా పశువులు తరలిస్తున్న నాలుగు వాహనాలు పట్టుకొని కేసులు నమోదుచేసినట్లు ఎస్ఐ వీరజనార్దన్ తెలిపారు.మండలంలో నుంచి నక్కపల్లి, గరివిడి, కోటపాడు, చోడవరం పశువులను తరలిస్తున్న వాహనాలు పట్టుకున్నామని చెప్పారు.ఒక వాహనంలో 12పశువులు, మరోవాహనంలో ఆరు, ఇంకో రెండు వాహనాల్లో 15 పశువులు తరలిస్తుండగా వాహనాలు స్వాధీనం చేసుకోని పశువులు తరలిస్తున్న వారిపై కేసులు నమోదుచేశామని చెప్పారు.

మద్యానికి సంబంధించి ముగ్గురిపై..

భోగాపురం, ఏప్రిల్14(ఆంధ్రజ్యోతి):భోగాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ వి.రవి కుమార్ సోమవారం తెలిపారు. భోగాపురం మండలంలోని కొల్లుపేటకు చెందిన ఓ మహిళ అక్రమంగా మద్యం విక్రయిస్తుండడంతో ఎనిమిది సీసాలతో అరెస్టుచేసి కేసునమోదు చేసినట్లు చెప్పారు.పూసపాటిరేగ మండలంలోని కోనాడ గ్రామానికి చెందిన ఇద్దరు కొప్పెర్ల గ్రామ సమీపంలో బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతుండగా వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ చంద్రమోహన్, హెచ్‌సీ సత్యనారాయణ, మహేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తాపడి ముగ్గురికి గాయాలు

భోగాపురం, ఏప్రిల్14(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమటాం రాయవలస సమీపంలో శ్రీకాకుళం నుంచి విశాఖ వెళ్లే సర్వీస్ రహదారిలో సోమవారం లారీ బోల్తాపడడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. ఎయిర్‌పోర్టు నిర్మాణంలో గల చెత్తను లారీలోకి ఎక్కించి దూరంగా తరలిస్తున్నారు. ట్రపెట్ సమీప సర్వీస్ రహదారిపైన ఎదురుగా స్కూటీ, పశువులు రావడంతో వాటిని తప్పించబోయి లారీ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో లారీ ఉన్న ముగ్గురికి గాయాలు అయ్యాయి. క్షతగాత్రులు తగరపువలసలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అలాగే రహదారిపై అడ్డంగా పడిన లారీని యంత్రంతో తొలగించారు. కాగా ఫిర్యాదు వస్తే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ వి.పాపారావు తెలిపారు.

మహిళల ఫిర్యాదులపై స్పందించాలి: ఎస్పీ

విజయనగరం క్రైం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మహిళల ఫిర్యాదులపై సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదులు అందిన వెంటనే కేసులు నమోదు చేయాలని ఎస్పీ వకుల్‌జిందాల్ కోరారు. సోమవారం విజయనగరం మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీగా ఆర్.గోవిందరావు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీని జిల్లా పోలీసు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ శక్తి మొబైల్ యాప్ పట్ల ప్రజలు, విద్యార్థినులు, యువతకు అవగాహన కల్పించాలన్నారు. ఇటీవల డీఎస్పీల బదిలీల్లో భాగంగా విజయనగరం మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీగా గోవిందరావు నియమించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో 'పోషణ పక్వాడా'

వేపాడ,ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి):అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్ వైజర్ కామేశ్వరి తెలిపారు. వేపాడ అంగన్‌వాడీ కేంద్రం-2లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ వియ్యంపేట ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా ఈనెల ఎనిమిదో తేదీ నుంచి పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లల ఎదుగుదలకు ఈ కార్యక్రమం దోహద పడుతుందన్నారు.అనంతరం కేంద్రంలో బ్యానర్లు,పోస్టర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన అవసరం: డీఎస్పీ

రాజాం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):ప్రతిఒక్కరికీ పర్యావరణ పరిరక్షణపై అవగాహన అవసరమని చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు తెలిపారు. సోమవారం రాజాం మునిసిపాలిటీ పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు వికాస తరంగిణి ఆధ్వర్యంలో గుడ్డ సంచలను పంపిణీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధాన్ని ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకువచ్చి పాటించాలని కోరారు. కార్యక్రమంలో టీటీవీ రమణమూర్తి, వాకచర్ల వెంకటపైడిరాజు, మురపాక గణేష్, గడే అప్పలనాయుడు, ఆర్‌వీజే నాయుడు, పెంకి చైతన్యకుమార్ పాల్గొన్నారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

భావోద్వేగాలు నిండిన చిత్రం



- ప్రదీప్ చిలుకూరి

'రాజా చెయ్యివేస్తే' ఫేమ్ ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. కల్యాణ్ రామ్ కథానాయకుడిగా నటించారు. ఎన్టీఆర్ ఆర్ట్ బేనర్‌పై అశోక్‌వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఈనెల 18న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు దర్శకుడు ప్రదీప్ చిలుకూరి. "కల్యాణ్‌రామ్‌తో ఓ మాస్ సినిమా చేద్దామని ఆలోచిస్తున్న సమయంలో ఓ ఆసక్తికరమైన ఐడియా పుట్టింది. వెంటనే ఆ లైన్‌ను కల్యాణ్‌రామ్‌కు చెబితే, ఆయనకు నచ్చింది. కానీ, అందులో తల్లి పాత్రలో విజయశాంతి నటిస్తేనే ముందుకు వెళ్దామని చెప్పారు. విజయశాంతికి కూడా తన పాత్ర నచ్చడంతో అంగీకరించారు. ఈ సినిమాలో క్లైమాక్స్ కీలకం. ఓ తల్లి కోసం తనయుడు ఏం చేసినా తక్కువే అని చూపించే పతాక సన్నివేశాలు ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తాయి. 'అమిగో', 'డెవిల్' లాంటి ప్రయోగాత్మక చిత్రాలు చేసిన తర్వాత కల్యాణ్‌రామ్ చేసిన పూర్తి స్థాయి యాక్షన్ చిత్రమిది. భావోద్వేగాలు, అద్భుతమైన పోరాట ఘట్టాలు గల ఈ సినిమా మాస్ ఆడియెన్స్‌తో పాటు కుటుంబ ప్రేక్షకులకూ నచ్చుతుంది. కల్యాణ్‌రామ్, విజయశాంతి మధ్య వచ్చే సన్నివేశాలు, సంభాషణలు, సంగీతం ఈ సినిమాకు ప్రధానాకర్షణ. తప్పకుండా విజయం సాధిస్తుంది" అని చెప్పారు.

సరికొత్త అనుభూతినిస్తుంది



- సంపత్‌నంది

దర్శకుడు సంపత్‌నంది దర్శకత్వ పర్యవేక్షణలో తెరకెక్కిన చిత్రం 'ఓదెల 2'. 2022లో విడుదలై ఘన విజయం సాధించిన 'ఓదెల రైల్వేస్టేషన్' చిత్రానికి ఇది సీక్వెల్. ఈ చిత్రానికి సంపత్ నంది కథను అందించి సమర్పకుడిగా వ్యవహరించారు. అశోక్ తేజ దర్శకత్వంలో మధు నిర్మించారు. ఈ నెల 17న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు సంపత్‌నంది. "ఈ సినిమా మొదటి భాగం తీస్తున్నప్పుడు పార్ట్ 2 గురించి ఆలోచించలేదు. కానీ చివరలో లీడ్ అయితే ఇచ్చాం. మొదటి భాగంలో హెబ్బా క్యారెక్టర్ సినిమాకే ప్లస్ అయ్యింది. అందుకే ఇందులో దుష్టశక్తితో పోరాడేందుకు ఓ బలమైన ఫిమేల్ క్యారెక్టర్ ఉంటే బాగుంటుందనిపించి తమన్నా పాత్రను సృష్టించాం. ఓ ఆత్మకు, సూపర్ నేచురల్ పవర్స్‌కు మధ్య జరిగే ఆసక్తికరమైన పోరు ఈ సినిమా కథాంశం. ప్రేక్షకులకు సరికొత్త విజువల్ అనుభూతిని పంచుతుంది. ఈ కథను రాసేందుకు చాలా పరిశోధన చేశాం. శివశక్తి, నాగసాధువులుగా మారతారని, శివాలయాలను శుద్ధి చేస్తారని.. ఇలా ఎన్నో విషయాలు తెలుసుకున్నాం. ఆ క్రమంలోనే ఈ సినిమాలో శక్తిమంతమైన నాగసాధు పాత్ర తయారైంది. తమన్నా ఇందులో తన లుక్ కోసం చాలా శ్రమించారు. సినిమాలో గ్రాఫిక్స్ పార్ట్ అధికంగా ఉంటుంది. ఆ విజువల్ ఎఫెక్ట్స్ ప్రేక్షకులకు థ్రిల్‌ను పంచుతాయి. దర్శకుడు అశోక్ ప్రతిభావంతుడు. ఆయన మేకింగ్ అదిరిపోతుంది" అని చెప్పారు.

మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది



నాని

నాని కథానాయకుడిగా 'హిట్' చిత్రాల ఫేమ్ శైలేష్ కొలను తెరకెక్కించిన చిత్రం 'హిట్ 3'. శ్రీనిధి శెట్టి కథానాయిక. వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. మే ఒకటిన చిత్రం విడుదలవుతోంది. ఇటీవలే విడుదలైన టీజర్, పాటలు సినిమాపై అంచనాలను తారస్థాయికి తీసుకెళ్లాయి. సోమవారం చిత్రట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ "ఈ మధ్య వస్తున్న సినిమాల ట్రైలర్‌లు ఆ సినిమాల విడుదలకు ఒక రోజో.. రెండు రోజుల ముందో వస్తున్నాయి. కానీ, ఒకప్పుడు ట్రైలర్‌లు సినిమా విడుదలకు 20 రోజుల ముందే విడుదల అయ్యేవి. అందుకే ఆ పాత రోజుల్ని గుర్తుచేయాలనే ట్రైలర్‌ను ముందుగానే విడుదల చేశాం. తెలుగు ప్రేక్షకులకు పరిచయం లేని ఓ సరికొత్త జానర్‌లో చేసిన చిత్రమిది. కొత్తగా ప్రయత్నించిన ప్రతీసారి ప్రేక్షకులు గెలిపించారు. మే ఒకటిన మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది. నేను యాక్షన్ సినిమాలు చేయాలని కోరుకునే వాళ్లంతా ఆ రోజు థియేటర్లకు వచ్చేయండి. నేను లవ్‌స్టోరీలు, ఫీల్ గుడ్, కామెడీ, కుటుంబ చిత్రాలు చేయాలనుకునే వారు ఆ రోజు కాస్త జాగ్రత్తగా ఉండండి. సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది. బలమైన భావోద్వేగాలతో నిండిన యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులకు పూనకాలు తెప్పిస్తాయి" అని చెప్పారు. "సినిమా యూనిక్‌గా ఉంటుంది. నాని నటన ఈ సినిమాను మరో లెవెల్‌కు తీసుకెళ్తుంది. ప్రతీ సన్నివేశం విజిల్స్ కొట్టేలా ఉంటుంది. 'అర్జున్ సర్కార్' ప్రేక్షకులకు చిరకాలం గుర్తుండిపోతాడు" అని దర్శకుడు శైలేష్ కొలను చెప్పారు.

విజువల్ వండర్



'అమరన్'తో సూపర్‌హిట్ అందుకున్న తమిళ నటుడు శివకార్తీకేయన్ నటిస్తున్న చిత్రం 'మదరాసి'. ఏ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో శ్రీలక్ష్మి మూవీస్ నిర్మిస్తోంది. రుక్మిణీ వసంత్ కథానాయిక. విద్యుత్ జామ్వాల్, బిజు మీనన్, షబీర్, విక్రాంత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్ సెప్టెంబరు 5న చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. విజువల్ వండర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్, సినిమాటోగ్రాఫర్: సుదీప్ ఎలామోన్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

జాట్ దర్శకుడికి తమిళుల హెచ్చరిక



బాలీవుడ్ హీరో సన్నీ డియోల్ హీరోగా తెలుగు దర్శకుడు గోపిచంద్ మలినేని తెరకెక్కించిన చిత్రం 'జాట్'. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. ఇటీవలె విడుదలైన ఈ చిత్రాన్ని బహిష్కరించాలని కోరుతూ సోషల్ మీడియా 'ఎక్స్'లో 'బాయ్‌కాట్ మూవీ' హ్యాష్ ట్యాగ్ వైరల్ అవుతోంది. ఎల్‌టీటీఈని ఒక ఉగ్రవాద సంస్థగా ఈ సినిమాలో చిత్రీకరించారంటూ కొందరు తమిళులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడులో అడుగుపెడితే దర్శకుడు గోపిచంద్ మలినేనికి తగిన బుద్ధి చెబుతామంటూ పోస్టులు పెడుతున్నారు. ఈ సినిమాలో ఎల్‌టీటీఈ పేరు ప్రస్తావించనప్పటికీ ఆ మార్క్ చూపుతూ సినిమా తీశారని కొందరు తమిళులు ఆరోపిస్తున్నారు.

పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకు?



ఇండస్ట్రీలో హీరో, హీరోయిన్ ఒకేలా కష్టపడుతున్నప్పుడు పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకని నటి సమంత ప్రశ్నించారు. కథానాయికలు ఈ విషయంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నారని అన్నారు. సినీ పరిశ్రమలో నెలకొన్న ఈ అసమానతలపై సమంత ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'హీరో, హీరోయిన్ సమాన ప్రాతినిధ్యం ఉన్న పాత్రల్లో నటించినప్పటికీ పారితోషికం విషయంలో మాత్రం వ్యత్యాసం ఉంటోంది. పరిశ్రమలో నన్ను ఇబ్బందిపెట్టే విషయాల్లో ఇదొకటి. దీనిలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నా. గత పరిస్థితులను నేను మార్చలేను. మార్పు నాతోనే మొదలవ్వాలని నా సంస్థలో ఇలాంటి వ్యత్యాసం రాకుండా చూసుకుంటున్నాను' అని చెప్పారు.

తమిళ భాషకు డిజిటల్ మెమోరియల్



ప్రపంచ ప్రాచీన భాషగా గుర్తింపు పొందిన తమిళానికి మరింత గుర్తింపు తెచ్చేలా 'డిజిటల్ మెమోరియల్‌'ని రూపొందించనున్నట్లు సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహ్మాన్ వెల్లడించారు. తమిళ నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన సందేశాన్ని వెల్లడిస్తూ, 'ప్రపంచ స్థాయి భాషలలో పరిణామం చెందుతూ అత్యంత శక్తిమంతమైన భాషగా తమిళం గుర్తింపు పొందింది. తమిళ భాషను ప్రపంచ వ్యాప్తం చేయడంలో తమిళ సంఘాల కృషి ముఖ్యమైనది. భాషను బలోపేతం చేయడంతో పాటు సవరణలు చేయడం ద్వారా దానిని సుసంపన్నం చేయడంలో ముఖ్యమైన పాత్రను పోషించాయి. వినూత్నమైన, అర్థవంతమైన మార్గాల్లో తమిళ భాషను తరువాతి తరానికి తీసుకెళ్ళాల్సిన బాధ్యత మనకుంది. తమిళ సాహిత్యం, సంస్కృతులను డిజిటలీకరణ చేసేందుకు, తమిళ భాషకు మరింత గౌరవం కల్పించేలా తమిళ సాహిత్యాన్ని వివిధ రూపాల్లో ప్రదర్శించేందుకు ఏఆర్‌ఆర్ ఇమ్మర్సివ్ ఎంటర్‌టైన్మెంట్ (ఏఆర్‌ఆర్ స్టూడియో) కృషి చేస్తుంది. తమిళ గౌరవాన్ని డిజిటల్ రెండరింగ్‌గా తయారు చేసేపనిలో నిమగ్నమై ఉంది. ఇది తమిళ భాష భవిష్యత్‌కు ఒక గర్వకారణంగా నిలుస్తుందని భావిస్తున్నాం' అని రెహ్మాన్ పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

బాలీవుడ్ చిత్రంలో పృథ్వీరాజ్



'ఎల్-2:ఎంపురాన్' చిత్రంతో దర్శకుడిగా విజయం సాధించారు మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్. ఇప్పుడు బాలీవుడ్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అధికారికంగా ప్రకటించారు. మేఘనా గుల్జార్ నిర్మించనున్న 'దైరా' అనే మూవీలో పృథ్వీరాజ్ శక్తిమంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనాకపూర్‌ని ఎంపిక చేశారు. ఈ సినిమా గురించి పృథ్వీరాజ్ మీడియాతో మాట్లాడుతూ 'స్క్రిప్ట్ వినగానే ఆసక్తిగా అనిపించింది. ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే పాత్ర నాది. నేను ఇండస్ట్రీకి వచ్చి 25 ఏళ్లు అయిన సందర్భంగా ఈ సినిమాలో నటిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఈ ప్రాజెక్టుపై కరీనా కూడా ఆనందం వ్యక్తం చేశారు' అని చెప్పారు.

ఏదో జరిగినే యెద లోపలా..



రాహుల్ విజయ్, నేహా పాండే జంటగా అశోక్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఖేల్ ఖతమ్ దర్వాజ బంద్'. వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై అర్జున్ దాస్యన్ నిర్మించారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా నుంచి 'ఏదో ఏదో..' అనే పాటను చిత్రబృందం సోమవారం విడుదల చేసింది. పూర్ణాచారి సాహిత్యానికి సురేశ్ బొబ్బిలి సంగీతం సమకూర్చారు. కార్తీక్, హరిణి ఆలపించారు. 'ఏదో ఏదో ఏదో జరిగెనే యెద లోపలా, ఏవో ఏవో కలలు విరిసెనే, నిన్నా మొన్నా లేదే..' అంటూ ఆకట్టుకునేలా సాగుతుందీ పాట.

వేశ్య పాత్ర... రీ ఎంట్రీ!



శివాజీ, నవదీప్, బిందు మాధవి ప్రధాన పాత్రల్లో మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'దండోరా'. లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై 'కలర్‌ఫొటో', 'బెదురులంక 2012' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన రవీంద్ర బెనర్జీ ముప్పానేని ఈ చిత్రానికి నిర్మాత. ఈ చిత్రం రెండో షెడ్యూల్ శరవేగంగా సాగుతోంది. 25 రోజులపాటు కొనసాగే చిత్రీకరణలో నటి బిందు మాధవి భాగమయ్యారు. చాలా కాలం తర్వాత బిందు మాధవి ఈ సినిమా ద్వారా రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో ఆమె వేశ్య పాత్రలో నటిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు మార్క్ కె.రాబిన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ

- జిల్లా అగ్నిమాపక శాఖాధికారి రాంప్రకాష్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రాం ప్రకాష్

విజయనగరం క్రైం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చునని జిల్లా అగ్నిమాపకశాఖాధికారి బీవీఎస్ రాంప్రకాష్ అన్నారు. సోమవారం జిల్లా అగ్నిమాపక శాఖ కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. వారోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంస్థలు, వాణిజ్య సముదాయాలు, ప్రధాన కూడళ్లలో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. అపార్టుమెంట్లలో అవగాహన కల్పిస్తూ, గ్యాస్ ప్రమాదాలపై అవగాహన కల్పిస్తామన్నారు. జిల్లాలోని అన్ని అగ్నిమాపక కేంద్రాల అధికారులు, సిబ్బంది తమ పరిధిలో ఈ కార్యక్రమాలు చేపడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాటిచ్చి... మనసు పెట్టి

- పూర్తి కావస్తున్న రాజాం-దోలపేట రహదారి
- పాలిటెక్నిక్ కళాశాల మంజూరు
- రక్షిత నీటి కోసం రూ.800 కోట్లు
- నియోజకవర్గ అభివృద్ధికి రూ.100 కోట్లు
- రాజాం అభివృద్ధిపై చంద్రబాబు శ్రద్ధ



పూర్తి కావచ్చిన రాజాం-దోలపేట రహదారి

రాజాం రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): 'జగన్ రెడ్డీ.. ఎన్నికలు ఎప్పుడు వస్తాయా... నిన్ను ఎప్పుడు ఇంటికి పంపుదామా అని రాష్ట్ర ప్రజలంతా ఎదురుచూస్తున్నార'ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతిపక్ష నేత హోదాలో గత ఏడాది ఏప్రిల్ 15న రాజాంలో నిర్వహించిన బహిరంగ సభలో విరుచుకు పడ్డారు. రాజాం నియోజకవర్గంలో ఏయే అభివృద్ధి పనులు చేపట్టబోయేదీ అప్పట్లో ప్రకటించారు. దీంతో ప్రజలు తెలుగుదేశం అభ్యర్థి కోండ్రు మురళీమోహన్‌ను ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు. ఇచ్చిన మాట ప్రకారం రాజాం నియోజకవర్గ అభివృద్ధికి చంద్రబాబు నిధులు మంజూరు చేస్తున్నారు.

ఆ రహదారి కోసం..

'రాజాం-పాలకొండ రహదారిని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత నాపై ఉంది. అధికారంలోకి రాగానే ఈ రహదారిని ఎంతో అభివృద్ధి చేస్తా'నని బాబు ప్రకటించారు. అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు బకాయి పడిన రూ.6.40 కోట్లు విడుదల చేయించారు. రాజాం-డోలపేట, బొబ్బిలి జంక్షన్-గాయత్రీ కాలనీ మధ్య రహదారి విస్తరణకు మరో రూ.6 కోట్లు విడుదల చేశారు. ప్రస్తుతం పట్టణంలో రెండోవిడత విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

తాగునీటికి రూ.800 కోట్లు..

నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి లేకుండా చేస్తానని ప్రకటించిన చంద్రబాబు.. అనుకున్న విధంగానే ఉన్నతాధికారులతో చర్చించారు. తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం మడ్డువలస ప్రాజెక్ట్ నుంచి రాజాం, చీపురుపల్లి నియోజకవర్గాలకు రక్షిత తాగునీరు అందించే లక్ష్యంతో చర్యలు చేపట్టలని ఉన్నతాధికారులకు ఆదేశించారు. దీంతో రెండు నియోజకవర్గాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రాజెక్ట్ నుంచి తాగునీటి సరఫరాకు రూ.800 కోట్లు అవసరమని ఉన్నతాధికారులు నివేదించారు. ఈమేరకు డి.పి.ఆర్. కూడా పూర్తయింది. మరో ఆరు నెలల్లో ప్రాజెక్ట్ నిర్మాణానికి ఓ రూపు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

పాలిటెక్నిక్ కళాశాల..

'సుమారు 13 మండలాలకు ముఖ్య కేంద్రం గా ఉన్న రాజాంలో పాలిటెక్నిక్ కళాశాల అవ సరమని నా దృష్టికి వచ్చింది. అధికారంలోకి రాగానే రాజాంలో పాలిటెక్నిక్ కళాశాల మం జూరు చేయిస్తా'నని రాజాం సభలో హామీ ఇచ్చిన చంద్రబాబు... ఇచ్చిన మాట ప్రకారం పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేయించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాలిటెక్నిక్ తరగతులు ప్రారంభం కానున్నాయి.

మౌలిక సదుపాయాలకు...

గడచిన ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో రహదారులు దారుణంగా తయారయ్యాయి. గ్రామీణ రహదారుల దుస్థితి మరింత దయనీయంగా మారింది. డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. అధికారంలోకి రాగానే రాజాం నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు నియోజకవర్గానికి రూ.4 కోట్లు మంజూరు చేశారు. రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాలలో డ్రైనేజీలు, సీసీ రోడ్లు, ఇతరత్రా అభివృద్ధి కార్యక్రమాలకు వివిధ పథకాల కింద సుమారు రూ.100 కోట్లు విడుదల చేయించారు. ప్రస్తుతం నియోజకవర్గం అంతటా రహదారులు, కాల్వల నిర్మాణ పనులు జోరందుకున్నాయి.

మరికొన్ని..

రాజాంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి సంబంధించి సాధ్యాసాధ్యాలపై ఇప్పటికే ఉన్నతాధికారులు నివేదికలు సేకరించారు. తోటపల్లి పిల్ల కాల్వల పనుల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఔటర్ రింగ్ రోడ్ సాధ్యమయ్యే పనికాదని... భూముల విలువ కోట్లలో ఉన్న పరిస్థితుల్లో భూసేకరణ సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయని సి.ఎం.ఒ.కు నివేదించినట్లు సమాచారం. టిడ్కో గృహాలపై అధికారులు సర్వే ప్రారంభించారు. ఏయే కేటగిరీలలో నిర్మాణం చేపట్టారు? లబ్ధిదారులెందరు? అనే అంశాలపై ప్రభుత్వం నివేదిక కోరింది. ఇవన్నీ చంద్రబాబు హామీలలో భాగంగానే చేస్తున్నారు.

చేపల వేటకు విరామం

- నేటి నుంచి అమలు
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ



వేట అనంతరం తీరానికి చేరుకుంటున్న మత్స్యకారులు

భోగాపురం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి)

సముద్రంలో రెండు నెలల పాటు చేపల వేటకు విరామం ప్రకటించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో ఆర్‌టీ నెంబర్-129ను విడుదల చేసింది. సంప్రదాయ తెప్పలతో చేపలు వేటాడుకోవచ్చు. మోటారు, మెకనైజ్డ్ బోట్లకు అనుమతి లేదు. చేపలు గుడ్లు పెట్టే దశలో మోటారు, మెకనైజ్డ్ బోట్లతో వేటాడితే మత్స్య సంపదకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. దీంతో ఏప్రిల్ 15వ తేదీ నుంచి జూన్ 14 అర్ధరాత్రి వరకు 61 రోజుల పాటు వేట నిషేధం అమలులో ఉంటుంది.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 28 కిలోమీటర్ల పొడవున సముద్ర తీరం ఉంది. భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో 19 సముద్ర తీర గ్రామాలు ఉన్నాయి. ఈ రెండు మండలాల్లో ముక్కాం, చేపలకంచేరు, కొండ్రాజుపాలెం, చింతపల్లి, పతివాడ, తిప్పలవలస, కోనాడ, కొల్లాయివలస తదితర గ్రామాల్లో సుమారు 3000 కుటుంబాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా మరో 1600 కుటుంబాలు మత్స్య సంపదపై ఆధారపడి జీవిస్తున్నాయి. వేట నిషేధం వల్ల ఈ కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడనున్నాయి. జిల్లా మొత్తమ్మీద సుమారు 885 వరకు మోటార్ బోట్లు ఉన్నాయి. నిషేధ సమయంలో చాలా వరకు మత్స్యకారులకు పని ఉండదు. కొన్నాళ్ల క్రితం వరకు ఈ ప్రాంత మత్స్యకారులు సంప్రదాయ తెప్పలతోనే చేపలు వేటాడేవారు. ప్రభుత్వం రాయితీపై మోటారు బోట్లను సరఫరా చేయడంతో వీటి సంఖ్య గణనీయంగా పెరిగింది. దాదాపుగా ప్రతి తీర గ్రామంలో పది నుంచి 15 వరకు మోటారుతో పని చేసే బోట్లు ఉన్నాయి. ఒక్కోబోటుపై 8 నుంచి 10 మంది వరకు మత్స్యకారులు చేపల వేటకు వెళుతుంటారు. తెప్పలతో 8 కిలోమీటర్ల పరిధిలోనే చేపల వేట సాగించవచ్చు. మోటరైజ్డ్ బోట్లతో అయితే 50 కిలోమీటర్ల వరకు ప్రయాణించి చేపల వేట సాగిస్తారు.

అందని సాయం..

చేపల వేట విరామ సమయంలో మత్స్యకార కుటుంబాలకు ఆసరాగా ఉండేందుకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుంది. గతంలో రూ.2 వేలు ఉన్న ఈ సాయాన్ని 2014-19 మధ్యలో టీడీపీ ప్రభుత్వం రూ.4 వేలకు పెంచింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ మొత్తాన్ని రూ.10 వేలకు పెంచింది. దీన్ని రూ.20 వేలకు పెంచుతున్నట్టు ఇప్పటి ప్రభుత్వం ప్రకటించింది. గతేడాదికి సంబంధించి భరోసా ఇప్పటి వరకు అందలేదు. గత ఏడాది 3,798 మందికి మత్స్యకార భరోసా అందజేయాలని మత్స్యశాఖ అధికారులు ప్రతిపాదనలు అందజేశారు. కానీ సాయం అందలేదు. రిజిస్ట్రేషన్ చేసుకొని ఉన్న బోట్లకు మాత్రమే ప్రభుత్వం భృతి మంజూరు చేస్తుంది. వేట నిషేధ సమయంలో మరబోట్లు వేటకు వెళితే ప్రభుత్వం చట్టరీత్యా చర్యలు తీసుకోనుంది. ఈ ఏడాదైనా కరువు భత్యాన్ని త్వరగా అందజేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.

పక్కాగా అమలు చేస్తాం..

ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకు సముద్రంలో చేపలు, రొయ్యల సంతానోత్పత్తి సమయం. మత్స్యసంపద ఉత్పత్తి, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఈ సమయంలో వేట నిషేధాన్ని అమలు చేస్తోంది. నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన బోటు యజమానులపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం. కరువు భత్యం మంజూరుకు అర్హులైన వారికి సంబంధించిన ఎన్యూమరేషన్‌పై ప్రభుత్వం నుంచి ఇంకా ఎటువంటి ఉత్తర్వులు రాలేదు. **-విజయకృష్ణ, మత్స్యశాఖ ఇన్‌చార్జ్ ఉపసంచాలకులు, విజయనగరం**